రాజ్యసభ ఎన్నికల్లో
రగులుతున్న క్రాసులు
అధిగమించి కట్టడిని
అల్లుకునే లేసులు.
అన్నీ పార్టీల ఎర
అడ్డగోలు ప్రలోభాలు
కాదంటరా ఎమ్మెల్యేలు
కౌగిలిస్తే స్వలాభాలు

చురక



-వేల్పుల నారాయణ
9440433475



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 2-3-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:167 పేజీలు:6 వెల: రూ.1/-


## టిప్పర్‌ను ఢీకొట్టడంతోనే లాస్య నందిత మృతి

**-కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదం కేసులో కీలక మలుపు**

హైదరాబాద్ మార్చ్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదం కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఓఆర్ఆర్‌పై జరిగిన ప్రమాదంలో టిప్పర్‌ను ఢీకొట్టడంతోనే లాస్య నందిత మృతిచెందారని గుర్తించారు. కారును ఢీకొన్న టిప్పర్‌ను పటాన్‌చెరు పోలీసులు గుర్తించారు. టిప్పర్‌ను సీజ్‌చేసిన పోలీసులు డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.గతనెల 23న పటాన్‌చెరు పరిధిలోని ఎల్లంకి ఇంజనీరింగ్ కాలేజ్ సమీపంలోని ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే లాస్య నందిత మరణిం చారు. ఆమె ప్రయాణిస్తున్న కారు.. గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి ఢీకొని అదుపు తప్పి రెయిలింగ్‌ను బలంగా ఢీకొంది. దీంతో వాహనం ముందువైపు ఎడమ భాగం నుజ్జునుజ్జయింది. కారు నడుపుతున్న ఆమె పీఏ ఆకాశ్ (26) తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న నందిత ఘటనా స్థలంలోనే మృతిచెందిన విషయం తెలిసిందే.

# త్వరలో రైతు, ఎడ్యుకేషన్ కమిషన్లను ఏర్పాటు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ మార్చ్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రైతు, ఎడ్యుకేషన్ కమిషన్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని... త్వరలోనే వీటిని ప్రకటించబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు పౌర సమాజం ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ... మన విద్యా విధానం ఎలా ఉండాలో ఎడ్యుకేషన్ కమిషన్ నిర్ణయిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ధర్నా చౌక్‌ను తెరిచామని అన్నారు. ప్రజా భవన్ ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ప్రజా పాలన ద్వారా సంక్షేమ పథకాల దరఖాస్తులు స్వీకరించామన్నారు. 25 ఎకరాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ గురుకులాలను ఒకే ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లో ఏర్పాటు చేయనున్నామన్నారు. పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కుల, మత వివక్షను పూర్తిగా తొలగించాలన్నదే వీటి ఉద్దేశమని చెప్పారు. పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయబోతున్నామని అన్నారు. పంట మార్పిడి పథకాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించామన్నారు.



### రైతు భరోసాపై చర్చలు

గత కేసీఆర్ ప్రభుత్వంలో ఉన్న చిక్కుముడులు తొలగించి ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. యూపీఎస్సీ తరహాలో టీఎస్పీఎస్సీ ద్వారా నియామకాలు చేపడతామని స్పష్టం చేశారు. కౌలు రైతుల రక్షణకు సంబంధించి అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని అన్నారు. అందరి సూచనలు , సలహాలు ఆధారంగా కౌలు రైతుల రక్షణకు చట్టం తీసుకురావాలని యోచిస్తున్నామని వివరించారు. రైతు భరోసా అనేది పెట్టుబడి సాయమని.. భరోసా ఎవరికి ఇవ్వాలనే దానిపై విస్తృత చర్చ జరగాలని కోరుతున్నామని అన్నారు. నిస్సహాయులకు, నిజమైన లబ్ధిదారు లకు అవసరమైతే చెప్పినదానికంటే ఎక్కువ సహాయం చేయొచ్చని వివరి ంచారు. ఆర్థిక, విద్యుత్, సాగునీటి రంగాలపై పూర్తి వివరాలతో అసెం బ్లీలో శ్వేతపత్రం విడుదల చేశామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి

ఖమ్మం, మార్చి 1 :(నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీల్లో భాగంగా ఇటీవల సెక్రటేరియట్ లో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కలు లాంఛనంగా గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. ఫిబ్రవరి మాసంలో 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించిన వారికి ఈ మార్చి మాసంలో జీరో బిల్లు చెల్లింపు రానుంది. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండల కేంద్రంలో ఇద్దరు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి స్వయంగా జీరో బిల్ తీసి గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో పాటు తెలంగాణ ఎన్పీడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ గౌతమ్, విద్యుత్ ఎస్ఇ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.




ఇక నుంచి 200 యూనిట్ల వరకు కరెంటు బిల్లు చెల్లించాల్సిన పనిలేదు, సంతోషమేనా అని లబ్ధిదారుడు మాలి కృష్ణయ్య భార్య సావిత్రితో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అనగా, చాలా సంతోషమని మాలి సావిత్రి బదులిచ్చారు. 200 యూనిట్ల వరకు విద్యుత్తు వినియోగించే వారు ఈ నెల నుంచి కరెంటు బిల్లు చెల్లించాల్సిన పనిలేదని, కరెంటు శాఖ వారు మీ ఇళ్లకు వచ్చి జీరో బిల్లు అందజేస్తారని ఉపముఖ్యమంత్రి అన్నారు. రూపాయి కూడా చెల్లించాల్సిన పనిలేదు వాళ్లు అడగరు, పథకం ఎలా ఉంది సంతోషమేనా అని డిప్యూటీ సీఎం వేల్పుల ఉషను ప్రశ్నించగా ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు. కృష్ణయ్య ఇంటికి సమీపంలోనే ఉన్న వేల్పుల సునీల్ ఇంటికి డిప్యూటీ సీఎం అధికారులతో కలిసి వెళ్లారు. సునీల్ భార్య ఉషకు జీరో బిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఇ సురేందర్, డిఇ రామారావు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 35,700 కోట్ల రూపాయల విలువ కలిగిన అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో శంకుస్థాపన జరిపి దేశ ప్రజలకు అంకితం ఇచ్చిన ప్రధాన మంత్రి



న్యూఢిల్లీ, మార్చి 1 :ముప్పై అయిదు వేల ఏడు వందల కోట్ల రూపాయల విలువైన అనేక అభివృద్ధి పథకాల కు ఝార్ఖండ్ లోని ధన్‌బాద్ లో గల సింద్ రీ లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న శంకుస్థాపన జరపడం తో పాటు దేశ ప్రజల కు అంకితమిచ్చారు. ఈ రోజు న ప్రారంభించుకొంటున్న అభివృద్ధి ప్రాజెక్టు లు ఎరువులు, రైల్ వే, విద్యుత్తు మరియు బొగ్గు ల వంటి అనేక రంగాల కు చెందినవి. శ్రీ నరేంద్ర మోదీ హెచ్‌యుఆర్ఎల్ నమూనా ను పరిశీలించడం తో పాటుగా సింద్ రీ ప్లాంటు యొక్క కంట్రోల్ రూము ను కూడా చూశారు.

సభ ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, 35,700 కోట్ల రూపాయల కు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టుల ను ఝార్ ఖండ్ లో ఈ రోజు న మొదలు పెట్టడమైందని చెప్తూ, రాష్ట్రం లోని రైతుల కు, ఆదివాసుల కు మరియు పౌరుల కు ఆయన అభినందనల ను తెలియ జేశారు.

సింద్ రీ ఎరువుల కర్మాగారాన్ని మొదలు పెట్టాలన్న తన సంకల్పాన్ని గురించి ప్రధాన మంత్రి గుర్తు కు తీసుకు వచ్చారు. "ఇది మోదీ యొక్క హామీ గా ఉండింది, మరి ఈ రోజు న ఈ హామీ ని నెరవేర్చడమైంది" అని ఆయన అన్నారు. 2018వ సంవత్సరం లో ఈ ఎరువుల కర్మాగారాని కి ప్రధాన మంత్రి యే శంకుస్థాపన జరిపారు. ఈ ప్లాంటు ఆరంభం అయినందువల్ల స్థానిక యువతీ యువకుల కు ఉద్యోగ సంబంధి నూతనమైన మార్గాల ను తెరచినట్లు అయింది అని ఆయన అన్నారు. ఆత్మనిర్భర్ భారత్ దిశ లో సాగుతున్న యాత్ర లో నేటి కార్యక్రమాని కి ప్రాముఖ్యం ఉంది అని ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రకటించారు. ప్రతి సంవత్సరం లో భారతదేశాని కి 360 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరపడుతుంది; మరి 2014వ సంవత్సరం లో భారతదేశం 225 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ను మాత్రమే ఉత్పత్తి చేసింది. డిమాండు కు, సరఫరా కు మధ్య గల భారీ అంతరం తో భారీ దిగుమతుల అగత్యం తలెత్తింది. "మా ప్రభుత్వం యొక్క ప్రయాసల కారణంగా, గడచిన పది సంవత్సరాల లో, యూరియా ఉత్పత్తి 310 లక్షల మెట్రిక్ టన్నుల కు వృద్ధి చెందింది" అని ఆయన తెలిపారు. రామగుండం-గోరఖ్‌పుర్, ఇంకా బరౌనీ ఎరువుల కర్మాగారాల ను పునరుద్ధరించే అంశాన్ని గురించి ప్రధాన మంత్రి మాట్లాడారు. ఈ జాబితా లోకి సింద్ రీ కర్మాగారాన్ని జోడించడం జరిగింది అని ఆయన అన్నారు. వచ్చే ఒకటిన్నర సంవత్సరం కాలం లో తాల్‌చెర్ ఎరువుల కర్మాగారం కూడా మొదలవుతుంది అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తెలియ జేశారు. ఆ ప్లాంటు ను కూడా దేశ ప్రజల కు తానే అంకితం చేయగలనంటూ ప్రధాన మంత్రి విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ అయిదు ప్లాంటు లు 60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ను తయారు చేయగలుగుతాయి. దీని ద్వారా ఈ ప్లాంటు లు భారతదేశాన్ని ఒక ముఖ్యమైన రంగం లో ఆత్మనిర్భరత సాధన దిశ లోకి శరవేగం గా తీసుకు పోతాయి అని ప్రధాన మంత్రి అన్నారు.

ఈ రోజు న ఝార్‌ఖండ్ లో క్రొత్త రైలు మార్గాల ఆరంభం, ఇప్పటికే ఉన్న రైలు మార్గాల లో డబ్లింగ్ పనులు మరియు అనేక ఇతర రైల్ వే ప్రాజెక్టుల పనుల ను మొదలు పెట్టడం వంటి చర్యల తో ఝార్‌ఖండ్ లో రైల్ వే రంగ సంబంధి క్రాంతి చోటుచేసుకొని ఒక క్రొత్త అధ్యాయం మొదలవుతోంది అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. ధన్‌బాద్-చంద్రపుర రైలు మార్గం ఆ ప్రాంతాని కి ఒక క్రొత్త రూపు ను సంతరించనుండడాన్ని గురించి, అలాగే బాబా బైద్యనాథ్ దేవాలయాన్ని మరియు మాత కామాఖ్య శక్తి పీఠాన్ని దేవ్‌ఘర్-డిబ్రూగఢ్ రైలు సర్వీసు కలపనుండడాన్ని గురించి ఆయన ప్రస్తావించారు.

వారాణసీ - కోల్‌కాతా - రాంచీ ఎక్స్‌ప్రెస్ వే కు వారాణసీ లో తాను శంకుస్థాపన చేసిన విషయాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గుర్తు కు తీసుకు వస్తూ, ఇది చత్‌రా, హజారీబాగ్, రామ్ గఢ్ మరియు బొకారో ల వంటి స్థానాల కు సంధానాన్ని మెరుగుపరచడం తో పాటు గా యావత్తు ఝార్‌ఖండ్ లో ప్రయాణాని కి పట్టే కాలాన్ని తగ్గిస్తుందని, అంతేకాకుండా భారతదేశం లోని యావత్తు తూర్పు ప్రాంతం లో సరకుల రవాణా సంబంధి వ్యవస్థ కు ఊతం లభించనుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు లు ఝార్‌ఖండ్ తో ప్రాంతీయ సంధానానికి ఊతం గా ఉండడం తో పాటు ఈ ప్రాంతం లో ఆర్థిక అభివృద్ధి కి వేగాన్ని జత చేస్తాయి అని ఆయన తెలిపారు.

"గడచిన పది సంవత్సరాల లో ఆదివాసీ సముదాయం, పేద ప్రజలు, యువతీయువకులు మరియు మహిళల యొక్క అభివృద్ధి కి పెద్దపీట ను వేయడం ద్వారా ప్రభుత్వం ఝార్‌ఖండ్ కోసం శ్రమించింది" అని ప్రధాన మంత్రి అన్నారు. 2047వ సంవత్సరాని కల్లా భారతదేశాన్ని ఒక అభివృద్ధి చెందినటువంటి దేశం గా తీర్చిదిద్దడాని కి ప్రాముఖ్యాన్ని ఇవ్వవలసి ఉంది అని ప్రధాన మంత్రి నొక్కి చెప్తూ, ప్రస్తుతం ప్రపంచం లో అత్యంత వేగవంతం గా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల లో ఒకటి గా భారతదేశం ఉందన్నారు. నిన్నటి రోజు న వెలువడిన తాజా త్రైమాసికం తాలూకు ఆర్థిక గణాంకాల ను గురించి ఆయన ప్రముఖం గా ప్రస్తావించారు. 2023వ సంవత్సరం అక్టోబరు మొదలుకొని డిసెంబరు మధ్య కాలం లో 8.4 శాతం వృద్ధి రేటు నమోదు అయింది, ఇది వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశ లో శీఘ్ర గతి న చోటుచేసుకొంటున్న అభివృద్ధి ని తెలియజెప్తోంది అని ఆయన అన్నారు. "వికసిత్ భారత్ ఏర్పడాలి అంటే వికసిత ఝార్‌ఖండ్ ను తయారు చేయడం కూడ అంతే ముఖ్యం'' అని ప్రధాన మంత్రి అన్నారు.

ఝార్‌ఖండ్ అభివృద్ధి చెందేటట్లుగా రాష్ట్ర ప్రభుత్వాని కి తమ ప్రభుత్వం అన్ని విధాల సమర్థన ను అందిస్తోంది అని ఆయన చెప్పారు. భగవాన్ బిర్‌సా ముండా పుట్టిన గడ్డ వికసిత్ భారత్ యొక్క సంకల్పాలు నెరవేరడాని కి ఒక శక్తి కేంద్రం గా ఉంటుందన్న విశ్వాసాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యక్తం చేశారు.

ప్రధాన మంత్రి తాను ధన్‌బాద్ కు వెళ్ళవలసి ఉన్న కారణం గా చిన్న ఉపన్యాసాన్నే ఇచ్చారు. కలలు మరియు సంకల్పాలు మరింత గా బలోపేతం అవుతాయి అని ఆయన అన్నారు. ఝార్‌ఖండ్ ప్రజల కు శుభాకాంక్షల ను మరియు అభినందనల ను తెలియజేస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

ఈ సందర్భం లో పాలుపంచుకొన్న వారి లో ఝార్‌ఖండ్ గవర్నరు శ్రీ సి.పి. రాధాకృష్ణన్, ఝార్‌ఖండ్ ముఖ్యమంత్రి శ్రీ చంపయీ సోరెన్, కేంద్ర మంత్రి శ్రీ అర్జున్ ముండా మరియు ఇతరులు ఉన్నారు. హిందుస్తాన్ ఉర్వరక్ & రసాయన్ లిమిటెడ్ (హెచ్‌యుఆర్ఎల్ ) సింద్రీ ఫర్టిలైజర్ ప్లాంటు ను దేశ ప్రజల కు ప్రధాన మంత్రి అంకితం చేశారు. 8900 కోట్ల రూపాయల కు పైగా వ్యయం తో అభివృద్ధి చేసినటువంటి ఈ ఎరువుల కర్మాగారం యూరియా రంగం లో స్వయంసమృద్ధి దిశ లో ఒక ముందంజ గా ఉంది. ఈ ప్లాంటు ప్రారంభం కావడం తో దేశం లో ప్రతి సంవత్సరం లో స్వదేశీ యూరియా ఉత్పాదన 12.7 ఎల్ఎమ్‌టి మేర పెరుగుతుంది. ఫలితం గా దేశంలో రైతుల కు ప్రయోజనం లభిస్తుంది. గోరఖ్‌పుర్ లోను, రామగుండం లోను ఎరువుల కర్మాగారాల పునరుద్ధరణ జరిగిన అనంతరం దేశం లో పున:ప్రారంభం అవుతున్న మూడో ఎరువుల కర్మాగారం ఇది; గోరఖ్ పుర్ లో ఎరువుల కర్మాగారాన్ని 2021వ సంవత్సరం డిసెంబరు లో మరియు రామగుండం లో ఎరువుల కర్మాగారాన్ని 2022వ సంవత్సరం నవంబరు లో దేశ ప్రజల కు ప్రధాన మంత్రి అంకితం చేశారు.

ప్రధాన మంత్రి ఝార్‌ఖండ్ లో 17,600 కోట్ల రూపాయల కు పైగా విలువ కలిగిన అనేక రైల్ వే ప్రాజెక్టుల ను ప్రారంభించడం తో పాటు దేశ ప్రజల కు అంకితం చేశారు. వీటి లో సోన్ నగర్-అండాల్ ను కలిపే మూడో మరియు నాలుగో లైను; టోరి- శివపుర్ మొదటి, రెండో మరియు బిరాటోలి- శివ్‌పుర్ మూడో రైలు లైను (టోరి- శివ్‌పుర్ ప్రాజెక్టు లో భాగం); మోహన్‌పుర్ - హంస్‌డిహా నూతన రైలు మార్గం; ధన్‌బాద్-చంద్రపుర రైలు మార్గం భాగం గా ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల తో రాష్ట్రం లో రైలు సేవలు విస్తృతం కావడం తో పాటు ఆ ప్రాంతం లో సామాజిక-ఆర్థిక అభివృద్ధి చోటు చేసుకోనుంది. కార్యక్రమం లో భాగం గా ప్రధాన మంత్రి మూడు రైళ్ల కు పచ్చజెండా ను చూపెట్టి వాటి ని ప్రారంభించారు. ఈ మూడు రైళ్లు ఏవేవి అంటే వాటిలో దేవ్‌ఘర్ - డిబ్రూగఢ్ రైలు సర్వీసు, టాటానగర్ మరియు బాదాంపహాడ్ ల మధ్య ఎమ్ఇఎమ్‌యు రైలు సర్వీసు (ప్రతి రోజూ) మరియు శివ్‌పుర్ స్టేశన్ నుండి సుదూర ప్రాంతానికి పోయేటటువంటి సరకుల రవాణా రైలుబండి ఉన్నాయి.

ప్రధాన మంత్రి ఝార్ ఖండ్ లో ఉత్తర కరణ్ పురా సుపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఎస్‌టిపిపి), చత్ రా కు చెందిన యూనిట్- 1 ( దీని సామర్థ్యం 660 మెగావాట్ లు) లు సహా ముఖ్యమైన విద్యుత్తు ప్రాజెక్టుల ను దేశ ప్రజల కు అంకితం చేశారు. 7500 కోట్ల రూపాయల కు పైగా వ్యయం తో అభివృద్ధి చేసినటువంటి ఈ ప్రాజెక్టు తో ఈ ప్రాంతం లో విద్యుత్తు సరఫరా మెరుగుపడనుంది. ఉపాధి కల్పన కు కూడా ఇది తోడ్పడనుంది. రాష్ట్రం లో సామాజిక, ఆర్థిక అభివృద్ధి కి దోహదం లభించనుంది. దీనితో పాటు ప్రధాన మంత్రి ఝార్ ఖండ్ లో బొగ్గు రంగం తో ముడిపడ్డ ప్రాజెక్టుల ను కూడా దేశ ప్రజల కు అంకితం చేశారు.

**నేటి కందం- నేటికి అందం**

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**రకరకములుగా వెలుగుచు**
**నొక మహితాద్భుత మనంగ నుల్లాస మిడన్**
**సకలోర్వికి చలువల నిడు**
**వికసిత చంద్రుడు కనబడు విశ్వమ్మునకున్**

( 2-3-24 చంద్రుడు 60 %
అధిక వెలుగులు ప్రసరించే రోజు )



-రాధశ్రీ
సెల్:9494481210

# పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : మంత్రి జూపల్లి

కొండాపూర్, మార్చి 1 : తెలంగాణ పర్యాటక రంగాన్ని ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథిమ్)తో పాటు మాదాపూర్ లోని శిల్పారామాలయాన్ని ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా శిల్పారామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పర్యాటక , ఆతిథ్య ఉన్నత విద్యా, శిక్షణ సంస్థగా నిథిమ్‌ను తీర్చిదిద్దుతామన్నారు. నిథిమ్ అకాడమిక్ బ్లాక్‌లోని తరగతి గదులను, హాస్పిటాలిటీ బ్లాక్‌లోని కిచెన్, బేకరీ, ట్రైనీ రెస్టారెంట్ మాక్ రూమ్స్‌లను పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు. వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

బోధన, బోధనేతర ఉద్యోగులు, సిబ్బందికి యూజీసీ స్కేల్ ప్రకారం వేతనాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఫారెన్ లాంగ్వేజ్ కోర్సులను విద్యార్థులకు అందించేలా ఇఫ్లూతో అసోసియేట్ అయ్యేలా చూడాలన్నారు. శిల్పారామం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, అధ్యయనం చేసి శిల్పారామం ఆదాయాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమం



లో పర్యాటక శాఖ, నిథిమ్ డైరెక్టర్ కే నిఖిల, టీఎస్టీడీసీ ఎండీ రమేష్ నాయుడు, శిల్పారామం ప్రత్యేక అధికారి జీ కిషన్‌రావు, నిథిమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మిషెల్ జే ప్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు త్వరలో ఇళ్ల స్థలాలు

**-మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి**

హైదరాబాద్, మార్చి 2: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం త్వరలో పరిష్కరిస్తుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రెండున్నర లక్షల చొప్పున చెల్లించి గడిచిన 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని చెప్పారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టుల సంఘాలు, ప్రతినిధులు, హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో త్వరలో సమావేశమై ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. హైదరా బాద్‌లో జర్నలిస్టులకు నగరానికి నాలుగు వైపుల స్థలాలను గుర్తించి ఎవరికి ఎక్కడ అనువైతే అక్కడే ఇచ్చేలా అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతు దైనందిన సమస్యలతో జర్నలిస్టులు వృత్తిపరమైన నైపుణ్యతపై దృష్టి సారించలేకపోతున్నారని, మీడియా అకాడమీ వారిలో నైపుణ్యత ను పెంచడానికి కృషి చేయాలన్నారు. మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం అక్రిడిటేషన్, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల వంటి సమస్యలను సంబంధం లేకుండానే అకాడమీకి అప్పగించడంతో ఇబ్బందు లు ఎదురయ్యాయ న్నారు. సీనియర్ సంపాదకులు కె. రామచంద్ర మూర్తి సీఎం సీపీఆర్ఓ అయోధ్య రెడ్డి, ఏపీ ప్రభుత్వ సలహాదారు దేవులపల్లి అమర్, సీపీఐ నాయకులు డాక్టర్ కె. నారాయణ, పల్లా వెంకట్ రెడ్డి, సియాసత్ ఎడిటర్ అమెర్ అలీఖాన్, ఏపీడ బ్ల్యూజే ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, టీయూడ బ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హన్మంత రావు పాల్గొన్నారు.



పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం కె. శ్రీనివాస్‌రెడ్డిని అభినందిస్తున్న సీఎం సీపీఆర్ఓ అయోధ్యరెడ్డి , సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమీషనర్ హన్మంతరావు, కె. రామచంద్రమూర్తి, దేవులపల్లి అమర్, విరాహత్ అలి తదితరులు.




సభలో ప్రసంగిస్తున్న కె. శ్రీనివాస్ రెడ్డి. వేదికపై సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హన్మంతరావు, దేవులపల్లి అమర్, సీనియర్ పాత్రికేయులు కె. రామచంద్రమూర్తి, అమెర్ అలీఖాన్.



అధ్యక్షోపన్యాసం చేస్తున్న విరాహత్ అలి. వేదికపై అల్లం నారాయణ, హన్మంతరావు, అయోధ్యరెడ్డి, దేవులపల్లి అమర్, కె. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు.



జర్నలిస్టు కుటుంబానికి అకాడమీ తరపున ఆర్థిక సాయం అందజేస్తున్న కె. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు.

## మధిర ప్రజలే నన్ను ఈ స్థాయికి తెచ్చారు.. కృతజ్ఞతలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి భట్టి ..

మధిర, మార్చి 1 : తనను ఈ స్థాయిలో ఉంచింది మధిర నియోజకవర్గ ప్రజలే అని డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండల సీతారాంపురంలో ఇవాళ జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో చెప్పిందే చేస్తాం చేయగలిగేదే చెప్తామన్నారు. తనను ఈ స్థాయిలో ఉంచింది మధిర నియోజకవర్గ ప్రజలు, సీతారాంపురం గ్రామస్థులు చల్లగా ఉండాలన్నారు.

కాగా, అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. పనుల విషయంలో అధికారులు పర్యవేక్షణ తప్పనిసరని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆరు గ్యారెంటీలు తప్పక అమలు చేసి తీరుతామన్నారు. రాష్ట్రంలో పేదలకు 2వందల యూనిట్లు విద్యుత్, 5 వందలకే గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలు ఇప్పటికే అమలు చేస్తున్నామన్నారు. మధిర నియోజకవర్గ ప్రజల ఓటుకు గౌరవం తెచ్చే విధంగా పనిచేస్తావన్నారు. ఉద్యోగులను గత ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందని, తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం వారిని తిరిగి అదుకుంటుందన్నారు.

# ఈశాన్య రాష్ట్రాల్లో రిమోట్ లాండ్ కస్టమ్స్ స్టేషనలో ఎలక్ట్రానిక్ డేటా ఇంటర చేంజ్ (ఇడిఐ) ప్రారంభించిన కేంద్ర ఆర్థికమంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్

అమరావతి, మార్చి 1:ఈశాన్య ప్రాంతానికి చెందిన లాండ్ కస్టమ్స్ స్టేషన్ల (ఎల్ సిఎస్) వద్ద ఎలక్ట్రానిక్ డేటా ఇంటర్ చేంజ్ (ఇడిఐ) వ్యవస్థను కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ న్యూఢిల్లీ నుంచి వర్చువల్ గా ప్రారంభించారు. ఈ రిమోట్ ఎల్ సిఎస్ కు ఇడిఐ అనుసంధానత ఏర్పడడంతో వస్తు కదలికలు, కస్టమ్స అనుమతులు మరింత సమర్థవంతం అయి ప్రాంతీయ వాణిజ్యం పెరుగుతుంది, ఇది ఆర్థిక వృద్ధిని ఉత్తేజితం చేస్తుంది.

కేంద్ర ఆర్థిక శాఖలో రెవిన్యూ కార్యదర్శి శ్రీ సంజయ్ మల్హోత్రా, కేంద్ర పరోక్ష పన్నుల బోర్డు (సిబిఐసి) చైర్మన్ శ్రీ సంజయ్ కుమార్ అగర్వాల్, సిబిఐసి (పరిపాలన, విజిలెన్స్) సభ్యుడు శ్రీ అలోక్ శుక్లా, సిబిఐసి (పన్ను విధానం, లీగల్) సభ్యుడు శ్రీ వివేక్ రంజన్, సిబిఐసి (కస్టమ్స్) సభ్యుడు శ్రీ సుర్జిత్ భుజబల్, సిబిఐసి (ఐటి, పన్ను చెల్లింపు సర్వీసులు, టెక్నాలజీ) సభ్యురాలు శ్రీమతి అరుణా నారాయణ్ గుప్తాలతో పాటు సిబిఐసి, ఆర్థికమంత్రిత్వ శాఖకు చెందిన రెవిన్యూ శాఖ సీనియర్ అధికారులు ఈ ఇడిఐ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేశంలో డిజిటల్ మౌలిక వసతులు కల్పించాలని, డిజిటల్ విప్లవ ప్రయోజనాలు అందరికీ అందుబాటులోకి వచ్చేలా చూడాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు దీటుగా దేశంలోని ప్రత్యేకించి ఉత్తర, ఈశాన్య ప్రాంత సరిహద్దుల్లోని నాన్-ఇడిఐ ఎల్ సిఎస్ లను ఇడిఐ ఎల్ సిఎస్ లుగా మార్చేందుకు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సిబిఐసి) చేస్తున్న కృషిని ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ 2023 జులై 21వ తేదీన గువాహటిలో జరిగిన ఒక సమావేశంలో ప్రశంసించారు. ఈశాన్య ప్రాంతంలో పని చేస్తున్న ఎల్ సిఎస్ లన్నింటినీ ఇడిఐ సదుపాయం గల కేంద్రాలుగా మార్చాలని ఆమె సిబిఐసికి నొక్కి చెప్పారు.

ఎగుమతులకు ఎదురవుతున్న అవరోధాలను తొలగించేందుకు కృషి చేయాలని సిబిఐసి, కస్టమ్స్ శాఖలను లాండ్ కస్టమ్స్ స్టేషన్ల వద్ద ఇడిఐ సదుపాయం ప్రారంభిస్తున్న సందర్భంగా ఆర్థికమంత్రి ఆదేశించారు. రిమోట్ ఎల్ సిఎస్ కు ఇడిఐ అనుసంధానత కల్పించడం ఈ దిశగా ఒక ముందడుగు అని, దీని వల్ల వస్తువుల కదలికలకు సంబంధి ంచిన వాస్తవిక డేటా అందుబాటులోకి వస్తుందని ఆమె అన్నారు.

సునిశితమైన సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేకించి జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో సిబ్బంది నియామకం విషయంలో అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆర్థికమంత్రి పిలుపు ఇచ్చారు.

"2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తయారుచేయాలన్నది ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆలోచన. ఇద సాకారం కావాలంటే ఆధునిక డిజిటల్ మౌలిక వసతులను అందుబాటులోకి తేవడం, టెక్నాలజీని సంపూర్ణంగా వినియోగంలోకి తేవడం, డిజిటల్ విప్లవం ప్రయోజనాలు పౌరులందరికీ అందుబాటులోకి తేవడం అవసరం. కస్టమ్స్ స్టేషన్లకు ఎలక్ట్రానిక్ డేటా ఇంటర్ చేంజ్ (ఇడిఐ) అనుసంధానత కల్పించడం ఈ దిశగా ముందడుగు. దీని వల్ల కస్టమ్స్ విధానాలు "ఫేస్ లెస్", "ఆటోమేటెడ్" అవుతాయి అని శ్రీ మల్హోత్రా అన్నారు.

"ఎన్ఇఆర్ లోని రిమోట్ ప్రాంతాల్లో ఉన్న లాండ్ కస్టమ్స్ స్టేషన్లకు ఇడిఐ అనుసంధానత కల్పించే ఈ కార్యక్రమం ద్వారా సిబిఐసి ఈశాన్య భారతం అభివృద్ధికి ఎంతో అవసరమైన పునాది వేసింది" అని శ్రీ మల్హోత్రా చెప్పారు.

ఈ సందర్భంగా శ్రీ అగర్వాల్ స్వాగతోపన్యాసం చేస్తూ ఈశాన్య ప్రాంతానికి (ఎన్ఇఆర్) భౌగోళికంగా వ్యూహాత్మక ప్రాధాన్యత ఉన్నదని, లాండ్ కస్టమ్స్ స్టేషన్ల (ఎల్ సిఎస్) వద్ద పొరుగు దేశాలకు వాణిజ్యం పెంపుదలకు మంచి అవకాశాలున్నాయని అన్నారు.

ఈశాన్యంలోని 7 రాష్ట్రాలు- అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అన్నింటినీ కవర్ చేస్తూ 44 ఎల్ సిఎస్ లున్నాయని శ్రీ అగర్వాల్ చెప్పారు. ఎల్ సిఎస్ ల వద్ద భౌతిక మౌలిక వసతుల కల్పన, కస్టమ్స్ విధానాల ఆటోమేషన్ భారత కస్టమ్స్ శాఖకు ఎల్లప్పుడూ ప్రాధాన్యతాంశాలుగానే ఉన్నాయి.

"ఈశాన్య ప్రాంతాల్లోని (ఎన్ఇఆర్) రిమోట్ ప్రదేశాల్లో వాణిజ్య సరళీకరణను ప్రోత్సహించడం, సమర్థతను పెంచడం దిశగా ఇడిఐ వ్యవస్థ ప్రారంభం ఒక ముందడుగు. వాణిజ్య, వ్యాపార ప్రయోజనాలకు టెక్నాలజీని ఉపయోగించుకోవడం పట్ల మా కట్టుబాటుకు ఇది నిదర్శనం" అని ధన్యవాదాలు తెలుపుతూ సభ్యుడు (కస్టమ్స్) శ్రీ సుర్జిత్ భుజబల్ అన్నారు.

ఈశాన్య ప్రాంతాల అభివృద్ధికి టెక్నాలజీని వినియోగించుకోవడంలో భాగంగా ఇక్కడ పొందుపరిచిన ఎల్ సిఎస్ ల వద్ద ఇడిఐ సౌకర్యం అందుబాటులోకి తెచ్చింది. అవి భారత-బంగ్లాదేశ్ సరిహద్దులోని ఘసువాపురా, భోలాగంజ్, షెల్లా బజార్, బోర్సోరా, ఖోవై ఘాట్, బఘ్మారా, గోనక్ గంజ్, కరీంగంజ్, దాకి; భారత-మయన్మార్ సరిహద్దులోని జోఖౌతర్. ఆప్టికల్ ఫైబర్ లేదా మొబైల్ నెట్ వర్క్ అందుబాటులో లేని సుదూర ప్రాంతాల్లో ఉన్న ఎల్ సిఎస్ వద్ద విశేషమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. పలు ప్రాంతాల్లో విశాట్ ఏర్పాటు ద్వారా సిబిఐసి ఈ అవరోధాలను అధిగమించగలిగింది. కస్టమ్స్ కార్యకలాపాల టెక్నికల్ సామర్థ్యం పెంచడం మాత్రమే కాదు, కర్తవ్య కాల్ దిశగా జాతి వేస్తున్న అడుగుకు సిబిఐసి కట్టుబాటును కూడా ఇది ప్రతిబింబిస్తుంది.

# వేసవికి ముందే ... భానుడి భగభగ..

## -వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండకపోతే ప్రాణాలకే ముప్పు: డాక్టర్ లిల్లీ మేరి

సిద్దిపేట మార్చ్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: వేసవికి ముందే ... ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10 గంటల నుంచి వేసవి తీవ్రత పెరిగిపోతుంది. నేటి బిజీ జీవితంలో ఎండకు బయటకు రాకుండా ఉండలేని పరిస్థితి. అయితే, ఎండలో ఎక్కువగా తిరిగితే వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది. వేసవిలో ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వడదెబ్బ తగిలిన తర్వాత అప్రమత్తంగా ఉండకపోతే ప్రాణాలకే ముప్పుగా మారుతుందని సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల సహాయ ఆచార్యులు డాక్టర్ లిల్లీ మేరి హెచ్చరించారు.

### లక్షణాలు:

ఎండలో ఎక్కువగా తిరిగే వారిలో నీటి శాతం తగ్గిపోతుంది. శరీరంలో సత్తువ కోల్పోవడం, నీరసం, బరువు తగ్గటం, చిరాకు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కండరాలు పట్టేయడం, తలనొప్పిగా ఉండటం, కళ్ళు బైర్లు కమ్ముతాయి. కొంతమందిలో విపరీతంగా జ్వరం రావడం, సొమ్మసిల్లి పోతుంటారు. మూత్రం పచ్చగా వస్తుంటే వడదెబ్బకు సూచిక గా భావించాలి. అందరిలో నోరు, నాలుక ఎండిపోయే అవకాశం ఉంది. చివరిగా వడదెబ్బ (హీట్ స్ట్రోక్) తగులుతుంది అని సహాయ ఆచార్యులు డాక్టర్ లిల్లీ మేరి తెలిపారు.

### ఇలా చేయొద్దు:

వేసవికాలంలో మద్యం సేవించకపోవడం మంచిది. రోడ్లపై విక్రయించే పానీయాలు సేవించవద్దు. రోడ్లపై అమ్మేఆహార పదార్థాలు తీసుకోవద్దు. మాంసాహారం తగ్గించి తాజా కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీళ్లు, పళ్ళ రసాలు, కొబ్బరి నీళు ఎక్కువగా తీసుకోవాలి. ప్రతిరోజు కనీసం 10 నుంచి 15 గ్లాసులు నీళు తాగాలి. రోజుకు రెండు పూటలా స్నానం చేయాలి. బయట పడుకునే వారు దోమతెరలు వినియోగించాలి. ఇంటి కిటికీలు తెరిచే ఉంచాలి అని సహాయ ఆచార్యులు డాక్టర్ లిల్లీ మేరి పేర్కొన్నారు.

### వడదెబ్బ తగిలితే...

వడ దెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లని ప్రదేశాలు, చుట్టూ నీడకు చేర్చాలి. గాలి వెలుతురు ప్రసరించే ప్రదేశాల్లో పడుకోబెట్టాలి. చల్లటి దుస్తులు కప్పాలి. శరీరం వేడిగా ఉంటే తడి వస్త్రముతో శుభ్రంగా తడవాలి. ఉప్పు, పంచదార కలిపిన నీళ్లను గంట గంటకు తాగించాలి. బాధితులు అపస్మారక స్థితిలో ఉంటే నీటిని తాగించవద్దు. కొందరికి వడదెబ్బ తగిలినప్పటికీ చెమట రాదు. ఇటువంటి వారు ఎక్కువగా నీళ్లు తాగాలి. కొందరిలో ఫిట్స్ వచ్చి, కోమాలోకి జారుకుంటుంటారు. వారిని వెంటనే ఆంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించాలి అని సహాయ ఆచార్యులు డాక్టర్ లిల్లీ మేరి తెలిపారు.

### డీ హైడ్రేషన్ కాకుండా జాగ్రత్త పడాలి

ఎండలో తిరిగే వారిలో నీటి శాతం తగ్గిపోతుంది. దీంతో వారు త్వరగా వడదెబ్బ బారిన పడతారు. అలాగే డీ హైడ్రేషన్ బారిన పడే అవకాశం ఉంది. నాలుక పై తడి తగ్గటం వల్ల పొడిగా మారుతుంది. తరచుగా పెదాలు తడుపుకునే ప్రయత్నం చేస్తారు. ఇలాంటి వారికి వెంటనే నీటి శాతం పెంచే ప్రయత్నం చేయాలి . బాధితులు డీ హైడ్రేషన్కు గురైతే బీపీ తగ్గిపోతుంది. రక్తప్రసరణలో తేడా రావటం వల్ల గుండె, కిడ్నీల పనితీరు మందగిస్తుంది. దీంతో ఇతర అవయవాల పనితీరులో మార్పులు చోటు చేసుకుంటాయి. ఇలాంటి వారిని వెంటనే ఆస్పత్తులకు తరలించి చికిత్సలు అందించాలని సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల సహాయ ఆచార్యులు డాక్టర్ లిల్లీ మేరి అన్నారు.

### ఈ జాగ్రత్తలు పాటిస్తే ...

ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎండలో బయటకు వెళ్లకపోవడమే మంచిది. ఏమైనా పనులు ఉంటే ఉదయం, సాయంత్రం సమయాల్లో చేసుకోవాలి. తప్పనిసరిగా బయటకు వెళ్లేవారు ముందుగా సాధ్యమైనంత వరకు ఎక్కువ నీటిని తాగాలి. ఎండకు రక్షణగా గొడుగు, టోపీలు, హెల్మెట్ ను ధరించడం మంచిది. వేసవిలో లూజుగా ఉండే కాటన్ దుస్తులను ధరించాలి. ఉద్యోగులైన భార్యాభర్తలు ఇంట్లో ఉండే వృద్ధులు, చిన్నపిల్లలకు అందుబాటులో మంచినీళ్లు ఉంచాలి. మూత్రం పచ్చ రంగులో ఉంటే సాధారణ రంగుకు మారేంతవరకు నీళ్లను తాగుతూనే ఉండాలి. ఆల్కహాలు, స్పైసీ ఫుడ్, కాఫీ, టీ, కూల్ డ్రింక్స్, ఐస్ క్రీములకు దూరంగా ఉండాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, నిమ్మరసము, కొబ్బరి నీళ్లు, రాగి అంబలి, నిత్యము తాగటం మంచిది. కీర, దోస, పుచ్చ పండు తినడం మంచిది లేదా వాడితో తయారు చేసిన జ్యూసులు తాగాలని సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల సహాయ ఆచార్యులు డాక్టర్ లిల్లీ మేరి అన్నారు.

# 12 కీలకమైన మరియు వ్యూహాత్మక ఖనిజాల తవ్వకాల కోసం రాయల్టీ రేట్లను క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 1:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం గనులు మరియు ఖనిజాల (అభివృద్ధి మరియు నియంత్రణ) చట్టం, 1957 (' ఎం ఎం డీ ఆర్ చట్టం')కి 12 కీలకమైన మరియు వ్యూహాత్మక ఖనిజాలైన బెరీలియం, కాడ్మియం, కోబాల్ట్, గాలియం, ఇండియం, రెనియం, సెలీనియం, టాంటాలమ్, టెల్లూరియం, టైటానియం, టంగ్స్టన్ మరియు వనాడియం. సంబంధించి రాయల్టీ రేటును పేర్కొనడానికి రెండవ షెడ్యూల్కు సవరణను ఆమోదించింది.

ఇది మొత్తం 24 కీలకమైన మరియు వ్యూహాత్మక ఖనిజాల కోసం రాయల్టీ రేట్ల హేతుబద్ధీకరణను పూర్తి చేస్తుంది. 2022 మార్చి 15న గ్లాకోనైట్, పొటాష్, మాలిబ్డినం మరియు ప్లాటినం గ్రూప్ ఆఫ్ మినరల్స్ మరియు లిథియం, నియోబియం మరియు రేర్ ఎర్త్ అనే 3 కీలకమైన ఖనిజాల రాయల్టీ రేటును 12 అక్టోబర్, 2023న ప్రభుత్వం నోటిఫై చేసిందని గమనించాలి.

ఇటీవల, గనులు మరియు ఖనిజాలు (అభివృద్ధి మరియు నియంత్రణ) సవరణ చట్టం, 2023, ఆగస్టు 17, 2023 నుండి అమలులోకి వచ్చింది. ఎం ఎం డీ ఆర్ చట్టం యొక్క మొదటి షెడ్యూల్లోని పార్ట్ డీ లో 24 క్లిష్టమైన మరియు వ్యూహాత్మక ఖనిజాలను జాబితా చేసింది. ఈ 24 ఖనిజాల మైనింగ్ లీజు మరియు కాంపోజిట్ లైసెన్స్ను కేంద్ర ప్రభుత్వం వేలం వేయాలని సవరణ చేసింది.

రాయల్టీ రేటు నిర్దేశానికి కేంద్ర మంత్రివర్గం ఈరోజు ఆమోదం తెలపడం వల్ల దేశంలోనే తొలిసారిగా ఈ 12 ఖనిజాల బ్లాకులను వేలం వేయడానికి కేంద్ర ప్రభుత్వం వీలు కల్పిస్తుంది. ఖనిజాలపై రాయల్టీ రేటు అనేది బ్లాకుల వేలంలో బిడ్డర్లకు ముఖ్యమైన ఆర్థికపరమైన అంశం. ఇంకా ఈ ఖనిజాల సగటు అమ్మకపు ధర ( ఏ ఎస్ పీ) లెక్కింపు పద్ధతిని కూడా గనుల మంత్రిత్వ శాఖ తయారు చేసింది. ఇది బిడ్ పారామితులను నిర్ణయించడానికి వీలు కల్పిస్తుంది.

ఎం ఎం డీ ఆర్ చట్టం యొక్క రెండవ షెడ్యూల్ వివిధ ఖనిజాలకు రాయల్టీ రేట్లను అందిస్తుంది. రెండవ షెడ్యూల్లోని అంశం 55 ప్రకారం, రాయల్టీ రేటు ప్రత్యేకంగా అందించబడని ఖనిజాలకు రాయల్టీ రేటు సగటు అమ్మకపు ధర (ఏ ఎస్ పీ)లో 12% ఉండాలి. అందువల్ల రాయల్టీ రేటు ప్రత్యేకంగా లేకపోతే వీటికి డిఫాల్ట్ రాయల్టీ రేటు ఏ ఎస్ పీ లో 12% ఉంటుంది. ఇది ఇతర క్లిష్టమైన మరియు వ్యూహాత్మక ఖనిజాలతో పోలిస్తే చాలా ఎక్కువ. అలాగే ఈ 12% రాయల్టీ రేటు ఇతర ఖనిజాలను ఉత్పత్తి చేసే దేశాలతో పోల్చదగినది గా లేదు అందువల్ల సహేతుకమైన రాయల్టీ రేటును కింది విధంగా పేర్కొనాలని నిర్ణయించబడింది:

దేశంలో ఆర్థికాభివృద్ధికి, జాతీయ భద్రతకు కీలకమైన ఖనిజాలు తప్పనిసరి అయ్యాయి. కాడ్మియం, కోబాల్ట్, గాలియం, ఇండియం, సెలీనియం మరియు వనాడియం వంటి క్లిష్టమైన ఖనిజాలు మరియు బ్యాటరీలు, సెమీకండక్టర్లు, సోలార్ ప్యానెల్లు మొదలైన వాటిలో ఉపయోగాలు ఉన్నాయి. ఈ ఖనిజాలు 2070 నాటికి శక్తి పరివర్తన మరియు నికర-సున్నా ఉద్గారాలను సాధించడంలో భారతదేశం యొక్క నిబద్ధత దృష్ట్యా ప్రాముఖ్యతను పొందాయి. బెరీలియం, టైటానియం, టంగ్స్టన్, టాంటాలమ్ మొదలైన ఖనిజాలు కొత్త సాంకేతికతలు, ఎలక్ట్రానిక్స్ మరియు రక్షణ పరికరాలలో వినియోగాన్ని కలిగి ఉన్నాయి. స్వదేశీ మైనింగ్ను ప్రోత్సహించడం వల్ల దిగుమతులు తగ్గుతాయి మరియు సంబంధిత పరిశ్రమలు మరియు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల స్థాపన జరుగుతుంది. ఈ ప్రతిపాదన మైనింగ్ రంగంలో ఉపాధి కల్పనను కూడా పెంచుతుందని భావిస్తున్నారు.

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీ ఎస్ ఐ) మరియు మినరల్ ఎక్స్ప్లోరేషన్ ఉ కన్సల్టెన్సీ లిమిటెడ్. (ఎం ఈ సీ ఎల్) ఇటీవల కోబాల్ట్, టైటానియం, గాలియం, వెనాడియం మరియు టంగ్స్టన్ వంటి క్లిష్టమైన ఖనిజాలలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఉన్న 13 బ్లాక్ల అన్వేషణ నివేదికను అందజేశాయి. ఇంకా, ఈ ఏజెన్సీలు దేశంలోని ఈ క్లిష్టమైన మరియు వ్యూహాత్మక ఖనిజాల కోసం అన్వేషణను నిర్వహిస్తున్నాయి.

లిథియం, ఆర్ ఈ ఈ , నికెల్, ప్లాటినం గ్రూప్ ఆఫ్ ఎలిమెంట్స్, పొటాష్, గ్లాకోనైట్, ఫాస్ఫోరైట్, గ్రాఫైట్, మాలిబ్డినం మొదలైన ఖనిజాల కోసం 2023 నవంబర్లో కీలకమైన మరియు వ్యూహాత్మక ఖనిజ బ్లాకుల వేలం యొక్క మొదటి విడతను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. పరిశ్రమ నుంచి సానుకూల స్పందన వస్తోంది. మొదటి విడతలో మొత్తం 20 మినరల్ బ్లాక్లను వేలం వేస్తున్నారు. వేలం యొక్క మొదటి విడత కోసం బిడ్ల సమర్పణ చివరి తేదీ (బిడ్ గడువు తేదీ) 26 ఫిబ్రవరి, 2024.

# ఏపీలో బీజేపీ ఒంటరిగానే పోటీ..!!

**-ఆపరేషన్ ఆంధ్రప్రదేశ్ చేపట్టిన బీజేపీ హైకమాండ్**
**-టీడీపీ, వైసీపీలో టికెట్లు దక్కని వారిపై బీజేపీ ఫోకస్**
**-ఇప్పటికే టికెట్ దక్కని వారు 30 నుంచి 40 మంది లీడర్లు బీజేపీతో టచ్లో..**

న్యూఢిల్లీ మార్చ్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు త్వరలోనే షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఏప్రిల్ మొదటి వారంలో సార్వత్రిక ఎన్నికలు జరిగే అవకాశం ఉందని బీజేపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికలతో పాటే ఏపీ అసెంబ్లీకి కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఏపీలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. అధికార పార్టీ వైసీపీని ఓడించేందుకు టీడీపీ ? జనసేన జతకట్టిన సంగతి తెలిసిందే. భారతీయ జనతా పార్టీ కూడా టీడీపీ ? జనసేనతో కలిసి పోటీ చేస్తుందని వార్తలు వచ్చాయి. కానీ బీజేపీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. టీడీపీ ? జనసేన కూటమితో కలిసి వెళ్లొద్దు అని బీజేపీ అధినాయకత్వం నిర్ణయించినట్టు సమాచారం. ఏపీ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలో దిగాలనే ఆలోచనలో బీజేపీ ఉన్నట్లు సమాచారం. తెలంగాణలో బీసీ సీఎం తరహా.. ఆంధ్రాలో కాపు సీఎం నినాదం ఎత్తుకుని, ఎన్నికల్లో పోటీ చేయాలని బీజేపీ పక్కా ప్రణాళిక రచిస్తున్నట్లు సమాచారం. మొత్తానికి బీజేపీ హైకమాండ్ ఆపరేషన్ ఆంధ్రప్రదేశ్ చేపట్టినట్లు తెలుస్తోంది. టీడీపీ, వైసీపీలో టికెట్లు దక్కని వారిపై బీజేపీ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికే టికెట్ దక్కని వారు 30 నుంచి 40 మంది లీడర్లు బీజేపీతో టచ్లో ఉన్నట్లు వార్తలు షికారు చేస్తున్నాయి.

# ఏపీలో తాగునీటి కోసం నాగార్జునసాగర్ నుండి నీరు విడుదల

అమరావతి మార్చ్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : ఏపీలోని రెండు జిల్లాలకు తాగునీటి సమస్య పరిష్కారం కోసం అధికారులు నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి మూడు టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు. ఫిబ్రవరి 1 న జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఏపీ నీటి వాటా కింద నీటిని విడుదల చేశారు. ఈ మేరకు కృష్ణా బోర్డు చెందిన అధికారులు సాగర్ కుడి కాలువ హెడ్రెగ్యులేడర్ నుంచి రెండు రాష్ట్రాల ఇంజినీర్ల సమక్షంలో విడుదల ప్రారంభించారు. రోజుకు 6వేల క్యూసెక్కుల చొప్పున మొత్తం 3 టీఎంసీల నీటిని 9 రోజుల పాటు విడుదల చేయనున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాలో తాగునీటి అవసరాలకు నీటిని వినియోగించనున్నారు.

# సమగ్ర వ్యాధి నియంత్రణ, మహమ్మారి సంసిద్ధత కోసం నేషనల్ వన్హెల్త్ మిషన్కు నాయకత్వం

న్యూఢిల్లీ, మార్చి 1:మానవుల, జంతువుల, వృక్షజాల, పర్యావరణ రంగాలన్నింటికీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి సమగ్ర వ్యాధి నియంత్రణ, మహమ్మారులను ఎదుర్కొనేందుకు సంసిద్ధత కోసం బహుళ మంత్రిత్వ శాఖ, బహుళ రంగ జాతీయ వన్ హెల్త్ మిషన్కు మిషన్ డైరెక్టర్గా పని చేయడంతో పాటుగా వన్ హెల్త్ జాతీయ సంస్థ, నాగ్పూర్ డైరెక్టర్గా వ్యవహరించేందుకు శాస్త్రవేత్త హెచ్ (15 వేతన స్థాయిలో) సమానమైన ఒక పదవిని సృష్టించాలన్న ప్రతిపాదనను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ ఆమోదించింది.

వన్ హెల్త్ జాతీయ సంస్థ డైరెక్టర్గా వేతన స్థాయి 15 (రూ.1,8 2,000 - రూ. 2,24,100) గల శాస్త్రవేత్త హెచ్ స్థాయి పదవిని సృష్టించడం వల్ల వార్షిక ఆర్థిక ప్రభావం దాదాపు రూ. 35.59 లక్షలుగా ఉండనుంది.

మానవులు, జంతు, వృక్షజాలం, పర్యావరణ రంగాలను ఏకీకృతం చేయడం ద్వారా సమీకృత వ్యాధి నియంత్రణ, మహమ్మారి సంసిద్ధత కోసం బహుళ మంత్రిత్వ శాఖలు, బహుళ రంగాల నేషనల్ వన్ హెల్త్ మిషన్ తాలూకు మిషన్ డైరెక్టర్తో పాటుగా నాగపూర్ వన్హెల్త్ జాతీయ సంస్థ డైరెక్టర్ సేవలందిస్తారు. సమీకృత వ్యాధులు, సమగ్ర వ్యాధుల కేంద్ర, మహమ్మారి సంసిద్ధత కోసం పరిశోధన, అభివృద్ధిని బలోపేతం చేసే వన్హెల్త్ జాతీయ ఆరోగ్యమిషన్ కోసం కార్యక్రమాన్ని 01.01.2024నే ఆమోదించారు. వన్ హెల్త్ విధానాన్ని వ్యవస్థీకరించడం ద్వారా సమగ్ర వ్యాధి నియంత్రణ, మహమ్మారి సంసిద్ధతను సాధించేందుకు జాతీయ వన్ హెల్త్ మిషన్ భారత్ తోడ్పాటునిస్తుంది.

# సీతారాములు మృతదేహానికి ఘనంగా నివాళులు

**- కాంగ్రెస్ నేత పరికపల్లి**



ఖమ్మం, మార్చి 1 :(నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలం పెద్దమునగాల గ్రామానికి చెందిన దానరి సీతారాములు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. వారి పార్థీవ దేహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ జిల్లా నాయకులు పరికపల్లి శ్రీనివాన్, ఆయన మాట్లాడుతూ... వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీనిచ్చి ఆధైర్య పడవద్దని మనోధైర్యాన్ని నింపి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ కార్యక్రమంలో తలారి పాపయ్య, ముల్లగిరి రత్తయ్య, దాసరి పెద్ద వెంకయ్య, లింగాల భాస్కర్, సామేలు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ (ఐబీసీఏ) ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 1 :పులుల సంరక్షణ కోసం భారతదేశం కేంద్రంగా అంతర్జాతీయ కూటమి ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 'ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్' (ఐబీసీఏ) కోసం, 2023-24 నుంచి 2027-28 వరకు, ఐదేళ్ల కాలానికి రూ. 150 కోట్ల ఏకకాలిక బడ్జెట్ కేటాయింపునకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గం అంగీకరించింది. ఐబీసీఏ ప్రధాన కార్యాలయాన్ని భారత్లో ఏర్పాటు చేస్తారు.

పులులు, ఇతర పెద్ద పిల్లులు సహా అంతరించిపోతున్న అనేక జాతుల పరిరక్షణలో భారతదేశం ప్రముఖ పాత్రను పోషిస్తోంది. ప్రపంచ పులుల దినోత్సవం, 2019 ప్రసంగంలో ఈ విషయాన్ని ప్రస్తావించిన శ్రీ నరేంద్ర మోదీ, ఆసియాలో పులుల వేటను అరికట్టడానికి ప్రపంచ దేశాలు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. భారతదేశం ప్రారంభించిన 'ప్రాజెక్ట్ టైగర్' 50వ వార్షికోత్సవం సందర్భంగా, 2023 ఏప్రిల్ 09న దీనిని పునరుద్ఘాటించిన ప్రధాని, పెద్ద పిల్లుల భవిష్యత్తును సురక్షితంగా ఉంచే లక్ష్యంతో 'ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్' ప్రారంభిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. పులులు, ఇతర పెద్ద పిల్లుల సంరక్షణ కోసం భారత్లో అభివృద్ధి చేసిన విధానాలు, పద్ధతులను ఇతర దేశాలు కూడా అనుకరించవచ్చు.

ఏడు పెద్ద పిల్లుల జాతుల్లో పులి, సింహం, చిరుతపులి, మంచు చిరుత, ప్యూమా, జాగ్వార్, చీతా ఉన్నాయి. వీటిలో పులి, సింహం, చిరుతపులి, మంచు చిరుత, చీతా మన దేశంలో కనిపిస్తాయి.

'ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్' అనేది 96 దేశాలు, సంస్థల కూటమి. ఇందులో, పెద్ద పిల్లులు కనిపించే దేశాలు, వాటి సంరక్షణలో ఆసక్తి ఉన్న ఇతర దేశాలు, పెద్ద పిల్లుల పరిరక్షణ రంగంలో పనిచేస్తున్న శాస్త్రీయ సంస్థలు ఉంటాయి. దీనికి అదనంగా, వ్యాపార సమూహాలు ఉ కార్పొరేట్లతో ఒక నెట్వర్క్ను స్థాపించడానికి, కేంద్రీకృత పద్ధతిలో సహకారాన్ని పెంచడానికి వాటిని ఒక ఉమ్మడి వేదికపైకి తీసుకురావచ్చు. తద్వారా, పెద్ద పిల్లుల జనాభాలో క్షీణతను అడ్డుకోవడానికి, క్రమంగా పెంచేందుకు పరిరక్షణ అజెండాలను బలోపేతం చేసేలా, ఆర్థిక మద్దతుతో కూడిన విజయవంతమైన విధానాలను, సిబ్బందిని ఉపయోగించవచ్చు. ఆయా దేశాలను, సంస్థలను ఉమ్మడి వేదికపైకి తీసుకురావడానికి పెద్ద పిల్లుల అజెండాలో భారతదేశ నాయకత్వ స్థానానికి ఇది నిదర్శనం.

పెద్ద పిల్లుల సంరక్షణను కొనసాగించడంలో పరస్పర ప్రయోజనం కోసం ఆయా దేశాల మధ్య పరస్పర సహకారాన్ని నెలకొల్పడం ఐఎఫ్సీఏ లక్ష్యం. విజ్ఞానాన్ని పంచుకోవడం, సామర్థ్యాన్ని పెంచడం, నెట్వర్కింగ్, చట్టాలు, ఆర్థిక ఉ వనరుల మద్దతు, పరిశోధన ఉ సాంకేతిక మద్దతు, విద్య ఉ అవగాహన పెంచడం వంటి వివిధ విషయాల్లో ఐబీసీఏ సాయపడుతుంది. స్థిరమైన అభివృద్ధి ఉ జీవనోపాధి భద్రతకు ప్రతిరూపాలుగా పెద్ద పిల్లులు ఉంటాయి కాబట్టి, భారతదేశం సహా కూటమి దేశాలు పర్యావరణ స్థితిస్థాపకత, వాతావరణ మార్పుల తగ్గింపుపై ప్రధాన ప్రయత్నాలు ప్రారంభిస్తాయి.

'గోల్డ్ స్టాండర్డ్' పెద్ద పిల్లుల పరిరక్షణ విధానాలను విస్తృతంగా వ్యాప్తి చేయడం, ఉమ్మడి సాంకేతిక పరిజ్ఞానాలు ఉ నిధులను అందుబాటులో ఉంచడం, ఇప్పటికే ఉన్న జాతుల-నిర్దిష్ట అంతర్జాతీయ వేదికలు, నెట్వర్క్లు, పరిరక్షణపై అంతర్జాతీయ కార్యక్రమాలను బలోపేతం చేయడం కోసం ఐసీఏ సహకార వేదికల ద్వారా సమన్వయాన్ని ఐబీసీఏ నిర్ధరిస్తుంది.

వివిధ రంగాల్లో విస్తృతంగా మారడం, అనుసంధానాలను ఏర్పరచడంలో బహుముఖ విధానాన్ని ఐసీఏ విధివిధానాలు అవలంబిస్తాయి. విజ్ఞానాన్ని పంచుకోవడం, సామర్థ్యాన్ని పెంచడం, నెట్వర్కింగ్, చట్టాలు, ఆర్థిక ఉ వనరుల మద్దతు, పరిశోధన ఉ సాంకేతికతల సాయం, వైఫల్యాలకు వ్యతిరేకంగా బీమా, విద్య ఉ అవగాహన వంటి వాటిపై సాయం చేస్తుంది. కూటమి దేశాల్లోని ప్రచారకర్తలు ఈ ఆలోచనను ప్రోత్సహించడంలో ముందుంటారు. మొత్తం ప్రక్రియలో కీలక వర్గంగా ఉన్న యువత ఉ స్థానిక సంఘాలు, ప్రజల్లోకి పెద్ద పిల్లుల సంరక్షణ ప్రచారాలను తీసుకెళతారు. అందువల్ల, పెద్ద పిల్లులు కూటమి సభ్యుల మధ్య ఉండే ప్రేరణలు భాగస్వాముల పరిరక్షణ ఉ శ్రేయస్సు ముఖచిత్రాన్ని మార్చగలవు.

సంపూర్ణ ఉ సమగ్రమైన పరిరక్షణ ఫలితాలను సాధించడానికి, 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాల'తో (ఎస్డీజీలు) జీవ వైవిధ్య విధానాలను సమగ్రపరిచాల్సిన ప్రాముఖ్యతను 'ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్' గుర్తించింది. స్థానిక అవసరాలతో జీవ వైవిధ్య పరిరక్షణ ప్రయత్నాలను అనుసంధానించే, ఐసీఏ సభ్య దేశాల్లో ఐక్యరాజ్యసమితి ఎస్డీజీల సాధనకు దోహదపడే విధాన కార్యక్రమాలకు అవి మద్దతుగా నిలుస్తాయి. ప్రాంతీయ విధానాలు ఉ అభివృద్ధి ప్రణాళిక ప్రక్రియల్లో జీవ వైవిధ్యాన్ని ఏకీకృతం చేయడానికి జీవ వైవిధ్యాన్ని అన్ని రంగాల్లో విధాన ఉ అభివృద్ధి ప్రణాళికల ప్రక్రియల్లో ప్రధాన చర్యగా మార్చడం ముఖ్యోద్దేశం. వ్యవసాయం, అటవీ, పర్యాటకం, మౌలిక సదుపాయాల అభివృద్ధి సహా స్థిరమైన భూ వినియోగ నమూనాలు, నివాస పునరుద్ధరణ కార్యక్రమాలు, జీవవైవిధ్య పరిరక్షణకు మద్దతు ఇచ్చే పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానాలను ప్రోత్సహించడం, వాతావరణ మార్పు, ఆహార భద్రత, స్వచ్ఛమైన నీటికి సంబంధించి ఎస్డీజీలను అందించడం ఇందులో ఉంటాయి.

ఐసీఏ పాలన యంత్రాంగంలో సభ్యుల అసెంబ్లీ, నిర్వహణ కమిటీ, సచివాలయం ఉంటాయి. భారతదేశంలో ప్రధాన కార్యాలయం ఉంటుంది. 'ఫ్రేమ్వర్క్ ఆఫ్ అగ్రిమెంట్'ను (శాసనం) ప్రధానంగా అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ) నమూనా ఆధారంగా రూపొందించారు, అంతర్జాతీయ స్టీరింగ్ కమిటీ (ఐఎస్సీ) దానిని ఖరారు చేస్తుంది. ఐఎస్ఏ, భారత ప్రభుత్వానికి అనుగుణంగా ఆతిథ్య దేశ ఒప్పందానికి రూపకల్పన జరిగింది. వ్యవస్థాపక సభ్య దేశాల నుంచి ప్రతిపాదించిన జాతీయాంశాల ద్వారా నిర్వహణ కమిటీ ఏర్పాటవుతుంది. తన సొంత డీజీని ఐబీసీఏ నియమించుకునే వరకు, ఓఏఇఈఅఅ సచివాలయం తాత్కాలిక అధిపతిగా డీజీ నియమిస్తుంది. మంత్రివర్గం స్థాయిలో, ఐబీసీఏ అసెంబ్లీకి హెచ్ఎంఈఎఫ్సీసీ అధ్యక్షుడు సారథ్యం వహిస్తారు.

ఐబీసీఏ కోసం, ఐదు సంవత్సరాలకు (2023-24 నుంచి 2027-28 వరకు) భారత ప్రభుత్వం రూ.150 కోట్ల ప్రాథమిక నిధి ఇస్తుంది. ద్వైపాక్షిక, బహుపాక్షిక సంస్థల ద్వారా అందించే నిధులు, ఇతర అర్హత గల సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, జాతీయ ఉ అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, దాత సంస్థల నుంచి ఆర్థిక సాయాన్ని సమీకరిస్తారు.

సహజ వనరుల స్థిరమైన వినియోగం జరుగేలా ఈ కూటమి చూస్తుంది, వాతావరణ మార్పుల వల్ల ఎదురయ్యే సవాళ్లను తగ్గిస్తుంది. పెద్ద పిల్లులను, వాటి ఆవాసాలను రక్షించడం ద్వారా, సహజ వాతావరణ అనుకూలత, నీరు ఉ ఆహార భద్రత, ఈ వ్యవస్థలపై ఆధారపడిన వేలాది సంఘాల శ్రేయస్సుకు ఐసీఏ దోహదం చేస్తుంది. పరస్పర ప్రయోజనాల కోసం వివిధ దేశాల మధ్య సహకారాన్ని ఐబీసీఏ ఏర్పాటు చేస్తుంది, దీర్ఘకాలిక సంరక్షణ సూత్రాలను ముందుకు తీసుకెళ్లడంలో గణనీయంగా దోహదపడుతుంది.

# కొత్తుర్తి గాంధీ కుటుంబానికి వెస్సో సంస్థ ఆర్థిక సహాయం



పాలకొల్లు మార్చ్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అనారోగ్య కారణాలతో ప్రస్తుతం ఎటువంటి సంపాదన లేక ప్రభుత్వం ఇచ్చే పింఛనుతోనే కాలం వెళ్లదీస్తున్న కొత్తుర్తి గాంధీ(78) కుటుంబానికి వెస్సో సంస్థ ఆర్థిక సాయయాన్ని అందించి మానవతను చాటుకుంది. పశ్చిమ గోదావరి పాలకొల్లు నివాసి వెండి పని చేసే వారు. స్థానికంగా చాలా చురుకుగా వివిధ పదవులలో సమాజానికి తన వంతు సేవలు అందించారు. వృత్తికి ఆదరణ తగ్గడంతో పాటు వయసుతో వచ్చిన. వీరి భార్య పార్వతి పోలియో బాధితురాలు. వివాహితుడైన కొడుకు పెయింటర్ గా దినసరి వేతనానికి పని చేస్తున్నాడు. గాంధీ భార్య పార్వతి దురదృష్టవశాత్తు బాత్ రూమ్ లో కాలు జారగా, పోలియో ఉన్న మోకాలు విరిగినది. బంధు మిత్రుల వద్ద చేసిన అప్పుతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో మోకాలి సర్జరీ చేయించారు. సర్జరీ అనంతరం చేసిన అప్పు తిరిగి తీర్చలేని పరిస్థితి! సర్జరీ అనంతరం జరిగే ఫిజియోథెరపీ మరియు మందులకు సుమారుగా ?50,000/- ఖర్చు అవుతుందని, ఆర్థిక సహాయం కొరకు స్థానిక వెస్సో కార్యకర్త ద్వారా వెస్సోని సంప్రదించారు. వెస్సో గౌరవ దాతల సహకారంతో గాంధీకి 50,001/-ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ, చికిత్స కొరకు ఆర్థిక ఇబ్బందులలో ఉన్న వృద్ధురాలికి సహాయం చేసి ఆదుకొన్న గౌరవ దాతలకు హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# సిరిసిల్లలో తేల్చుకుందామా - కేటీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి సవాల్

హైదరాబాద్, మార్చి 1 : భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్ విసిరారు. 'ఎమ్మెల్యేలుగా ఇద్దరం రాజీనామా చేద్దాం. నేను సిరిసిల్లలో పోటీ చేస్తా. నాపై కేటీఆర్ గెలిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా. సిరిసిల్లలో ఆయన ఓడితే భారాసను మూసివేస్తామని ప్రకటించాలి''అని సవాల్ చేశారు. ఇటీవల ఒక సమావేశంలో రేవంత్ మగాడివైతే వచ్చే లోక్ సభ ఎన్నికలలో ఒక్క ఎంపి సీటులలోనైనా గెలిపించా లంటూ కెటిఆర్ కు సవాల్ విసిరారు.. దీనికి స్పందించిన కెటిఆర్ కోడంగల్ మీరూ, సిరిసిల్లా లో నేను రాజీనామా చెద్దాం..ఆ తర్వాత ఎంపిగా మీరు ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి లోక్ సభ నుంచి ఇద్దరం పోటీ చేద్దాం రమ్మంటూ రేవంత్ ఆహ్వానం పలికారు?.. అ ఎన్నికతో ఎవరు ఎంటో తేలిపోతు దన్నారు కెటిఆర్ .. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి సెక్రటేరియట్‌లో కోమటిరెడ్డి మీడిమాతొ మాట్లాడుతూ, నల్గొండలో రిజైన్ చేస్తా.. కేటీఆర్ సిరిసిల్లలో రిజైన్ చేయాలన్నారు.. తాను సిరిసిల్లలో పోటీ చేస్తా.. ఒక వేళ ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా.. కేటీఆర్ ఓడిపోతే బీఆర్ఎస్ పార్టీని పార్టీ క్లోజ్ చేస్తారా అని సవాల్ విసిరారు.

కాగా, ఇక మరో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీని తెలంగాణ నుండి పోటీ చేయాలని టీపీసీసీ నుండి ప్రపోజల్ పెట్టామని తెలిపారు. రాహుల్ గాంధీ ఆ రెండు చోట్ల ఎక్కడ పోటీ చేసిన నాలుగు లక్షలకు పైగా మెజారిటీ వచ్చే బాధ్యత తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. లోక్ సభ ఎన్నికల్లో తమకు ప్రత్యర్థి బీజేపీనే.. బీఆర్ఎస్ పోటీనే కాదని తేల్చి చెప్పారు. బీఆర్ఎస్ ఎలాగూ పోటీలో లేదని.. బీజేపీకి రెండు, మూడు సీట్లు వస్తాయేమో మాకైతే తెల్వదని అన్నారు.

బీజేపీ ఎంపీ తనకు రూ.2 వేల కోట్లు ఉన్నాయని అర్వింద్ అన్నారని.. నా పేరుమీద ఎక్కడైనా అన్ని ఆస్తులు ఉంటే అరవింద్‌కు రాసి ఇస్తానని కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో తాము ఆస్తులు సంపాదించలేదని,ఉన్న ఆస్తులు పోగుట్టుకున్నామని తెలిపారు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత తనవి, కోమటిరెడ్డివి ఆస్తులు తగ్గాయన్నారు.

# కన్నెర్రజేసిన మిర్చి రైతు.. ఖమ్మం మిర్చి మార్కెట్ ఎదుట ఆందోళన



హైదరాబాద్, మార్చి 1 : మిర్చి రైతులు కన్నెర్రజేశారు. ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే వ్యాపారులు ధరలు తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జెండా పాటకంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం ఖమ్మం మిర్చి మార్కెట్ ఎదుట ఆందోళన చేపట్టారు. రైతులకు న్యాయం చేసే వరకు పోరాడుతామని మార్కెట్ ప్రధాన గేటు ముందు బైఠాయించారు

రైతుల ఆందోళనతో మార్కెట్‌లో కొనుగోళ్లు ఎక్కడికక్కడ ఆగిపోయాయి.

# ఢాకాలోని ఓ రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం.. 43 మంది మృతి




ఢాకా మార్చ్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని ఓ రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఆ దుర్ఘటనలో సుమారు 43 మంది మరణించారు. డజన్ల సంఖ్యలో జనంగాయపడ్డారు. ఏడు అంతస్తుల భవనంలో ఈ ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం వల్ల 43 మంది చనిపోయినట్లు బంగ్లాదేశ్ ఆరోగ్యశాఖ మంత్రి సమంత లాల్ సేన్ తెలిపారు. గాయపడ్డవారు ప్రస్తుతం ఢాకా మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్నారు. బర్న్ హాస్పిటల్‌లో దాదాపు 40 మందికి చికిత్స అందిస్తున్నారు.ఢాకాలోని బెయిలీ రోడ్డులో ఉన్న పాపులర్ బిర్యానీ రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారి మహమ్మద్ షిహబ్ తెలిపారు. చాలా వేగంగా మంటలు బిల్డింగ్‌లోని పై ఫ్లోర్లకు వ్యాప్తించాయి.

దీంతో ఆ ఫ్లోర్లలో ఎక్కువ సంఖ్యలో జనం చిక్కుకున్నారు. ప్రమాదం జరిగిన రెండు గంటల్లోనే అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పింది. సుమారు 75 మందిని రెస్క్యూ చేశారు.

ఢాకాలోని బెయిలీ రోడ్డులో ఎక్కువ శాతం రస్టారెంట్లు, క్లాతింగ్, మొబైల్ ఫోన్ షాప్స్ ఉన్నాయి. కచ్చి భాయ్ అనే రెస్టారెంట్‌లో ప్రమాదం జరిగింది. ఫస్ట్ ఫ్లోర్‌లో మంటలు అంటుకున్నాయి. అయితే పై అంతస్తుల్లో ఉన్న వారు దూకడం, ఊపిరి ఆడకపోవడం వల్ల మరణించారు.


విజ్ఞాన సరోవర ప్రచురణలు మరియు
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త
ఆధ్వర్యంలో
ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు రచించిన
మలగని బత్తి (నవలాత్రయం-Trilogy)
ఆవిష్కరణ సభ
ముఖ్య అతిథి మరియు ఆవిష్కరణ
ప్రొఫెసర్ కోదండరాం
తెలంగాణ ఉద్యమ నాయకుడు




అధ్యక్షులు : ఏనుగు నరసింహా రెడ్డి
విశిష్ట అతిథి : మామిడి హరికృష్ణ
ప్రత్యేక అతిథి : బి. మల్లేశ్వర రెడ్డి
ఆత్మీయ వక్తలు : కె.పి. అశోక్ కుమార్
పి. జ్యోతి
చింతపట్ల సుదర్శన్
స్వాగతం : సుధా శ్రీనివాస రావు

తేది. 4.3.2024 సోమవారము సా॥ 6.00 గం॥లకు
సభాస్థలి: రవీంద్ర భారతి మినీ హాల్ - హైదరాబాద్.
అందరూ ఆత్మీయ ఆహ్వానితులే...


# గులాబీ పార్టీకి జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ రాజీనామా

## -కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సమక్షంలో బిజెపి లో చేరిక

న్యూ ఢిల్లీ మార్చ్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: పార్లమెంట్ ఎన్నికల ముంగిట బీఆర్ఎస్ కు బిగ్ షాక్ తగిలింది. గులాబీ పార్టీకి జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ రాజీనామా చేశారు. ఢిల్లీలోని బీజేపీ జాతీయ కార్యాలయంలో కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సమక్షంలో ఎంపీ బీబీ పాటిల్ కాషాయ కండువా కప్పుకున్నారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి ఆయన రాజీనామా చేశారు. రాజీనామా లేఖను బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు పంపించారు. ఆయన బీజేపీలో చేరడంతో సంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2014, 2019 ఎన్నికల్లో రెండుసార్లు కేసీఆర్ పార్టీ నుంచి ఎంపీగా బీబీ పాటిల్ గెలుపొందారు. గత కొంత కాలంగా బీఆర్ఎస్ హై కమాండ్‌పై ఆయన అసంతృప్తితో ఉన్నారు. కేసీఆర్ తీరుపై కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తో ంది. కాషాయ పార్టీలో చేరితేనే తనకు రాజకీయంగా భవిష్యత్తు ఉంటుందని భావించిన బీబీపాటిల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

### బీఆర్ఎస్ నుంచి రోజుకో వికెట్: లక్ష్మణ్

కాగా.. బీబీ పాటిల్ బీజేపీలో చేరడంపై ఆ పార్టీ ఎంపీ లక్ష్మణ్ స్పందించారు. బీబీ పాటిల్ బీజేపీలో చేరడాన్ని స్వాగతిస్తున్నానని లక్ష్మణ్ అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభివృద్ధి మోడల్ నచ్చి నేతలు బీజేపీలో చేరుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ నుంచి రోజుకో వికెట్ కోల్పోతుందని చెప్పారు. ఆ పార్టీ రెక్కలు తెగిన పక్షిలా తయారైందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు బయటకు కత్తులు దుస్తున్నట్లు నటిస్తూ బీజేపీ బలోపేతాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. రెండు పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణలో బీజేపీ బలోపేతాన్ని అడ్డుకోలేవని చెప్పారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో 17 స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని లక్ష్మణ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# అర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

హనుమకొండ మార్చ్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఉచిత పథకాలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను బిచ్చగాళ్లను చేస్తున్నారని అర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు హనుమకొండలో జరిగిన బీజేపీ విజయ సంకల్ప యాత్రలో ముఖ్య అతిథిగా రాకేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ యాత్రలో బీజేపీ శ్రేణులు భారీగా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ అంటేనే అవినీతి, ఆ పార్టీకు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేస్తే దేశం మళ్లీ ముక్కలవుతుందని ఆరోపించారు. మాజీ మంత్రి కేటీఆర్, సీఎం రేవంత్ రెడ్డి మేనేజ్ మెంట్, పేమెంట్ కోట రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అవినీతికి కేరాఫ్ కాంగ్రెస్... అభివృద్ధికి నిలయం బీజేపీ అని చెప్పారు.కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని అన్నారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టులో అవినీతికి పాల్పడిన అందరినీ అరెస్ట్ చేయాలని.. సీబీఐ విచారణ చేయించాలని కోరారు. రేవంత్ ప్రభుత్వం తుమ్మితే ఊడిపోతుందని చెప్పారు. రేవంత్ తన స్థాయికి తగ్గట్లుగా మాట్లాడాలని సూచించారు. రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్రమోదీపై యుద్ధం చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అలా యుద్ధం చేస్తా అన్న ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలే ఇంట్లో కూర్చున్నారని పైడి రాకేష్ రెడ్డి అన్నారు.

# వైసీపీలో చేరిన సీనియర్ టీడీపీ నేత..

అమరావతి, మార్చి 1 :కడప జిల్లా పులివెందుల నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి ఇవ్వాల (శుక్రవారం) సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. పార్టీ కండువాతో సతీష్ రెడ్డిని సీఎం జగన్ స్వాగతించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, పలువురు స్థానిక నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే స్త్రీకి సంపూర్ణ విముక్తి

**- శ్రామిక మహిళా దినోత్సవ కార్యక్రమంలో స్పష్టం చేసిన ఐపీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంపంగి పద్మ.**

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ(ఎం.ఎల్)చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లెపల్లి ప్రభాకర్.**



సంగారెడ్డి మార్చ్ 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడన, అణిచివేత, వివక్షతలకు వ్యతిరేకంగా శ్రామిక మహిళాలోకం సంఘటితంగా ఉద్యమిస్తూనే, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారానే స్త్రీలకు సంపూర్ణమైన విముక్తి సాధ్యం అని భారత ప్రగతిశీల మహిళా సంఘం(ఐపీఓడబ్ల్యూ) జాతీయ కన్వీనర్ సంపంగి పద్మ అంతర్జాతీయ శ్రామిక మహిళా ధినోత్సవ సభలో స్పష్టం చేసారు. " మార్చి 1 నుండి 8 వరకు " రెండు తెలుగు రాష్ట్రాల్లో 114 వ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని తమ హక్కుల సంఘటిత సందేశ ధినంగా జరపండని ఐపీఓడబ్ల్యూ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మార్చి-1, 2024 న శుక్రవారం రోజు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సి.సంతోష్ ఆధ్యక్షతన శ్రామిక మహిళా ధినోత్సవ సభను నిర్వహించారు.

ఈపై కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లెపల్లి ప్రభాకర్ తోపాటు ఐపీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి పెర్క సునీత, ఐ.ఎఫ్.టి.యు. (శ్రామిక స్పందన) జాతీయ కార్యదర్శి షేక్ షావలి, భరత అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకులు కటారి పళిని స్వామి, సీత తధితరులు వక్తలుగా పాల్గొని ప్రసంగించారు. ఇటీవల పీఓడబ్ల్యూ(స్త్రీ విముక్తి, పీఓడబ్ల్యూ(విముక్తి), అఖిల భారత విప్లవ మహిళా సంఘం మూడు విప్లవ మహిళా కార్మిక సంఘాలు ఐక్యంగా కలిసి ఒకే విప్లవ మహిళా కార్మిక సంఘంగా ఐపీఓడబ్ల్యూ ను ఏర్పాటు చేసుకొని మొట్టమొదటి సారిగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో శ్రామిక మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని జరుపుకుంటున్న శ్రామిక మహిళలకు మల్లెపల్లి ప్రభాకర్ విప్లవ జేజేలు తెలియజేస్తూ, అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శ్రామిక మహిళలు, గ్రుహిణులు, విద్యార్థినిలు వర్గపోరాటాలలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సామాన్య పేద మధ్యతరగతి మహిళా లోకం తీవ్రమైన శారీరక, మానసిక హింసలకు గురౌతున్నారని పెర్క సునీత గుర్తుచేశారు. అన్నిరకాల లైంగిక అత్యాచార దోపిడీ, అవినీతికి వ్యతిరేకంగా సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరాన్ని వివరించారు. పనిగంటల తగ్గింపు, పనిప్రదేశాలలో మెరుగైన సౌకర్యాలు, పనికి తగ్గ శ్రమ ఫలితం కొరకు అంతర్జాతీయ శ్రామిక మహిళా లోకం జరిపిన పోరాటాలు, త్యాగాల ఫలితంగానే ప్రపంచవ్యాప్తంగా 8 గంటల పనివిధానం, స్త్రీలకు అనేక హక్కులు శ్రామిక మహిళా లోకానికి సిద్దించాయని షేక్ షావలి గుర్తు చేస్తూ, పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను, ప్రజాస్వామికమైన హక్కులను నేడు కేంద్రంలో బీజేపీ నరేంద్ర మోదీ ప్రభుత్వం కాలరాస్తూ, బడా కార్పొరేట్ శక్తుల దోపిడీకి, విద్వేషా పూరితమైన మతతత్వ రాజకీయాలకు పాల్పడుతున్నదని ఎండగట్టారు. చివరలో కటారి పళిని స్వామి మహిళా సమస్యలపై ఆలపించిన విప్లవ గేయాలు ఆకట్టుకున్నాయి.

# మేడిగడ్డను సరిచేయండి.. వ్యవసాయాన్ని రాజకీయాలతో ముడిపెట్టొద్దు : నిరంజన్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 1 :కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బరాజ్‌లో కుంగింది మూడు పిల్లర్లు మాత్రమే అని, వాటిని సరిచేసి వ్యవసాయానికి నీళ్లు ఇవ్వాలని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సూచించారు. వ్యవసాయాన్ని రాజకీయాలతో ముడిపెట్టి.. రైతుల పొలాలను ఎండబెట్టొద్దు.. రైతాంగం ఉసురు పోసుకోవద్దు అని నిరంజన్ రెడ్డి అన్నారు. మేడిగడ్డ బరాజ్ సందర్శన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

మేడిగడ్డ బరాజ్ విషయంలో తప్పులు జరిగి ఉంటే ఉన్నతస్థాయి విచారణ జరిపి శిక్షలు పడేలా చూడాలి. కానీ రైతుల పొలాలను ఎండబెట్టకూడదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ ఒక బరాజ్ మాత్రమే. ఇది కాకుండా సుందిళ్ల, అన్నారం బరాజ్‌లు, పంప్ హౌస్‌లు, అండర్ గ్రౌండ్ టన్నెళ్లు, రిజర్వాయర్లు, ఓపెన్ కెనాళ్లతో 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సిస్టమ్ అభివృద్ధి చేసి ఉన్నదని తెలిపారు. వీటన్నింటినీ పక్కకు పెట్టి కుంగిన మూడు పిల్లర్లను చూపి ఇదే మొత్తం ప్రాజెక్ట్ అని దుర్బుద్దితో దుష్ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని మేడిగడ్డను సరిచేయాలి. లేకుంటే గడపగడపకూ వెళ్లి రైతులను చైతన్యం చేస్తాం.. ఇంటికో వంద మందిని జమచేసి ఇంజనీర్ల సహకారంతో రైతులతోనే దీనిని రిపేర్ చేయించుకుంటాం. రాజకీయాన్ని, వ్యవసాయాన్ని కాంగ్రెస్ కలిపి చూడొద్దు.. ఏ ప్రభుత్వమైనా రైతుల కడగండ్లు తీర్చాలన్నారు. రైతుబంధు ఇవ్వకున్నా అప్పుచేసి సాగు చేశారు. ఇప్పుడు ఆ పంటలు ఎండిపోవడంతో రైతులు అవస్థపడుతున్నారు అని నిరంజన్ రెడ్డి తెలిపారు.

### నీటి లభ్యత కోసమే మేడిగడ్డ బరాజ్

నీటి లభ్యత కోసమే మేడిగడ్డ బరాజ్‌ను నిర్మించామని తెలిపారు. తుమ్మిడిహట్టిని వదిలిపెట్టింది అందుకే. ప్రాజెక్టు అంతిమలక్ష్యం రైతులకు సాగునీరు అందించడమే. 2007లో తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పించింది. నాడు కేంద్రంలో, రాష్ట్రంలో, పక్కన ఉన్న మహారాష్ట్రలో కూడా కాంగ్రెస్ అధికారంలో ఉన్నది. కానీ నాటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను మహారాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ తిరస్కరించిందని గుర్తు చేశారు. 2007 నుండి 2014 వరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క అనుమతి తీసుకోలేదు. అప్పుడు మంత్రిగా ఉన్న ఉత్తమ్ ఇప్పుడు కేసీఆర్ తుమ్మిడిహట్టి వద్ద కట్టాల్సి ఉండె అని మాట్లాడడం అత్యంత చెత్తగా, జుగుప్సాకరంగా ఉందని ధ్వజమెత్తారు.

### కేసీఆర్ రికార్డు సమయంలో నిర్మించారు..

కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అటు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని, ఇటు కేంద్రాన్ని ఒప్పించి.. కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు సమయంలో నిర్మించారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రయోజనాలతో పాటు రైతులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని తెలిపారు. కాంగ్రెస్ మాదిరిగా ప్రాజెక్టుల నిర్మాణం దశాబ్దాల పాటు సాగదీయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని జీర్ణించుకోలేక లేని అభాండాలని వేసి రాజకీయ లబ్ది కొరకు సత్య దూరం మాటలు మాట్లాడటం సిగ్గు చేటు అని మండిపడ్డారు. అనవసర పంతాలకు పోయి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నోట్లో మట్టి కొట్టేందుకు ప్రయత్నం చేస్తుంది అని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు.

### రైతుబంధు ఇచ్చేందుకు మూడు నెలల సమయం

కేసీఆర్ పాలనలో రైతులకు సకాలంలో నీళ్లు ఇచ్చారు. 24 గంటల ఉచిత కరెంట్ అందించారు. పంట పెట్టుబడి కూడా సాయం చేశారు. పండిన పంటను కొనుగోలు చేసి రైతుల ముఖాల్లో కేసీఆర్ సంతోషం చూశారని నిరంజన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మళ్లీ రైతులకు కరెంట్ కటకట, నీటికి కటకట, రైతుబంధుకు కటకట ఏర్పడింది. మూడెకరాల వరకు రైతుబంధు ఇచ్చేందుకు మూడు నెలల సమయం తీసుకున్నారు. కాంగ్రెస్ వచ్చాక ఏర్పడిన దుర్భర పరిస్థితులను రాష్ట్ర ప్రజలు గమనించాలి అని నిరంజన్ రెడ్డి సూచించారు.

# ఆరో తేది నుంచి చంద్రబాబు ప్రజాగళం యాత్ర..

అమరావతి, మార్చి 1 : ఇప్పటికే రా కదలిరా, జండా సభ పేరుతో వివిధ కార్యక్రమాల్ని నిర్వహించిన టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 6 నుంచి సరికొత్త కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్లనున్నారు. ఈనెల 4న రాప్తాడు సభతో రా కదలిరా సభలు ముగియనున్నాయి.

అనంతరం 'ప్రజాగళం' పేరుతో చంద్రబాబు ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించారు. మార్చి 6వ తేది నుంచి వరుసగా ఐదు రోజులపాటు 'ప్రజాగళం' కార్యక్రమం చేపట్టనున్నారు. తొలి రోజున నంద్యాల, మధ్యాహ్నం మైదుకూరులో 'ప్రజాగళం' కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు.


ఆహ్వానము

చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్
శ్రీకేతనమ్, 27-1-167, ఆదిత్య నగర్, నెల్లూరు - 2.
అక్షరోత్సవం
తేది: 3-3-2024, ఆదివారం
సమయం : ఉదయం 10 గం॥లకు
వేదిక : టౌన్‌హాల్ రీడింగ్ రూమ్ ఏ/సి

సభాధ్యక్షులు
శ్రీ తుంగా శివప్రభాత్‌రెడ్డి
సంపాదకులు, 'లాయర్' వారపత్రిక
ముఖ్యఅతిథి
డా॥ శ్రీమతి నందమూరి లక్ష్మీపార్వతి
అధ్యక్షులు, ఆం.ప్ర తెలుగు & సంస్కృత అకాడమీ
పురస్కారగ్రహీతలు
శ్రీ కంఠ బంగార్రాజు
ప్రముఖ కవి, విజయవాడ
శ్రీ కలిమిశ్రీ
సంపాదకులు, నవమల్లెతీగ, విజయవాడ
విశిష్ట అతిథి
శ్రీ మాడభూషి సంపత్‌కుమార్
సంచాలకులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం
ఆత్మీయ అతిథులు
శ్రీ శ్రీరామకవచం సాగర్
ప్రముఖ నవలా రచయిత, కవి, ఒంగోలు
డా॥ శ్రీ బీరం సుందరరావు
ప్రముఖ కవి, విమర్శకులు, చీరాల


ప్రధాన అవార్డు గ్రహీత
కవి సంగమ ఉద్యమసారధి
శ్రీ యాకూబ్
హైదరాబాద్
కవులు, కవయిత్రులకు ఆత్మీయ సత్కారాలు
శ్రీ ఏటూరి నాగేంద్రరావు
శ్రీ మద్దూరు శ్రీనివాసులు
శ్రీ అవ్వారు శ్రీధరబాబు
శ్రీ నల్లు రమేష్
శ్రీమతి గోవిందరాజు సుభద్రాదేవి
శ్రీమతి ఎస్.వి.ఎన్. నాగగాయత్రి
శ్రీమతి వాయుగుండ్ల శశికళ
శ్రీమతి ఎస్‌డి. నజ్మా
శ్రీమతి బొగ్గరపు ఇందిరా కృష్ణ

ఉదయం 9.30 గం॥లకు
కవి సమ్మేళనం, ఆపాత మధుర గీతాలు
శ్రీమతి లక్ష్మీపార్వతి, శ్రీ యాకూబ్ గార్లచే కవులకు సత్కారం
విందు : మ॥ 1.30 గంటలకు
నిర్వహణ
'కళాంజలి' అనంత్ దువ్వూరు బెనర్జీ

